క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న సెబ్ సీఐ విన్నీలత

ఆదోని రూరల్: గోతులదొడ్డి, ఉప్పరహాల్ గ్రామాల్లో ఆదివారం సెబ్ పోలీసులు దాడులు చేయగా 18 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడినట్లు సెబ్ సీఐ విన్నీలత విలేకరులకు తెలిపారు. మోటార్ సైకిళ్లపై ఇద్దరు వ్యక్తులు అక్రమంగా 18 బాక్సుల(1728 టెట్రా ప్యాకెట్లు) కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేశామన్నారు. అలాగే ఆదోని పట్టణంలో 20 లీటర్ల నాటుసారాను సీజ్ చేసి వెంకటేష్, జాతెప్ప, నరసింహులు, గుంటమ్మ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శంగా పోలింగ్ కేంద్రాలు


ఆదోనిలో కిడ్డీస్ పాఠశాల పోలింగ్ కేంద్రం ముస్తాబు


ఎమ్మిగనూరు బాలికల కళాశాల కేంద్రం

ఆదోని అర్బన్/ఎమ్మిగనూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆదోని పట్టణంలో మూడు, ఎమ్మిగనూరులో పలు చోట్ల ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదోని కిడ్డీస్ పాఠశాల, సెయింట్ జోసెఫ్ స్కూల్, బాలికల కళాశాల, ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సుందరంగా తీర్చిదిద్దారు. మామిడి తోరణాలు, బెలూన్లు కట్టి ఓటర్లకు స్వాగతం పలికేలా కార్పెట్‌లు ఏర్పాటు చేశారు. నీడ కోసం శామియానాలతో పాటు ఫొటో సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేయడంతో విశేషంగా ఆకట్టుకుంటోంది. అలాగే కేంద్రాల్లో బారికేడ్లు, ర్యాంపు, తాగునీరు, వైద్య సదుపాయం ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాలను ఆర్ఓ శివనారాయణశర్మ, మున్సిపల్ అధికారులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

ఓట్ల పండుగకు వేళాయె

- విధులకు తరలివెళ్లిన సిబ్బంది
- 544 మంది పీఓ, ఏపీఓలు, 1088 మంది ఓపీఓలతో ఎన్నికల నిర్వహణ
- 300 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు


ఎమ్మిగనూరులో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లేందుకు బస్సుల కోసం వేచి ఉన్న సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కోసం నియోజకవర్గంలోని మూడు మండలాలతో పాటు పట్టణంలోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం బ్యాలెట్లతో సిబ్బంది ఆదివారం తరలివెళ్లారు. స్థానిక బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి, స్థానిక కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పోలింగ్ నిర్వహణపై తగిన సూచనలు చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్ తదితర పోలింగ్ సామగ్రి అందజేశారు. నియోజకవర్గంలోని 272 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణకుగాను 272 మంది పీఓలు, 272 మంది ఏపీఓలు, 1088 మంది ఓపీఓలను నియమించారు. ఎమ్మిగనూరు పట్టణంతో పాటు గోనెగండ్ల, నందవరం మండలాల్లో 29 రూట్‌లతో పాటు 20 వీడియో గ్రాఫర్, అన్ని కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు ఆర్ఓ చిరంజీవి తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అధికారులు మరోసారి ఈవీఎం పనితీరుపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సిబ్బంది అందుకున్న సామగ్రిని సరిచూసుకొని కేటాయించిన బస్సుల్లో పోలీసు సిబ్బందితో పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. సాయంత్రం 4 గంటల్లోపు సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నట్లు ఆర్ఓ తెలిపారు. పట్టణ, రూరల్, గోనెగండ్ల సీఐలు మధుసుదన్‌రావు, మోహన్‌రెడ్డి, రామకృష్ణయ్య బందోబస్తు కోసం వచ్చిన గుజరాత్ పారామిలటరీ బలగాలు, కర్ణాటక పోలీసులు, జిల్లా పోలీసు సిబ్బందికి పోలింగ్ కేంద్రాల వద్ద విధులు కేటాయించారు. ప్రశాంత పోలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు.


ఎమ్మిగనూరులో పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఓ చిరంజీవి


ఎమ్మిగనూరులో పోలింగ్ సామగ్రితో తరలివెళుతున్న సిబ్బంది


పోలీసులకు బందోబస్తు విధులు కేటాయిస్తున్న సీఐలు

పోలింగ్‌కు సర్వం సిద్ధం

మంత్రాలయం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఎలక్షన్ కమిషన్ నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 237 పోలింగ్ బూత్‌లకు ఓటింగ్ యంత్రాలు చేరుకున్నాయి. స్థానిక పరిమళ విద్యానికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూము నుంచి 61 మార్గాల్లో యంత్రాలను తరలించారు. ఆర్ఓ ఎ.మురళి నేతృత్వంలో 24 సెక్టార్లుగా విభజించి ఈవీఎంల తరలింపు, పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లు కానిచ్చారు. మంత్రాలయం మండల కేంద్రంలోని 73వ పోలింగ్ బూత్‌ను మోడల్ పోలింగ్ స్టేషన్‌గా ఎంపిక చేశారు.


కోసిగిలోని పోలింగ్ బూత్ వద్ద పోలీసుల పర్యవేక్షణ

పోలింగ్ బూత్ ఆహ్వాన ద్వారం, కార్పెట్లు, పచ్చ తోరణాలు, పూలమాలలతో ఓటర్లను ఆకట్టుకునేలా సుందరంగా తీర్చిదిద్దారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి


బుట్టా రేణుక, ఎమ్మెల్యే అభ్యర్థి

ఎమ్మిగనూరుటౌన్: పేదల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి వారి అభ్యున్నతికి కృషి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక విన్నవించారు. మోసపూరిత హామీలిచ్చే నాయకులకు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. అమలు సాధ్యం కాని హామీలిచ్చే వారిని నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వాల పనితీరును బేరీజు వేసుకుని మేలు చేసిన వారిని ఆదరించాలని కోరారు. ఓటు హక్కుతో విలువైన భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి


చెన్నకేశవరెడ్డి, ఎమ్మెల్యే

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ పాలనకు ప్రజలు పట్టం కట్టాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. మోసపూరిత వాగ్దానాలను నమ్మి మోసపోకుండా ప్రతిఒక్కరూ విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించే వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

పోలింగ్ నేపథ్యంలో అల్లర్లకు పాల్పడితే చర్యలు

గోనెగండ్ల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ రామకృష్ణయ్య హెచ్చరించారు. ఆయన ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. సోమవారం జరిగే పోలింగ్‌కు 350 మంది సిబ్బందితో మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ బూత్‌ల దగ్గర 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయా పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజలు వంద మీటర్ల దూరంలో ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయరాదన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు సహకరించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలింపు


ఆదోనిలో ఆర్ఓ శివనారాయణ శర్మతో మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్ మీర్‌తారిఖ్ అలీ


ఈవీఎంలను తీసుకెళుతున్న ఎన్నికల సిబ్బంది

ఆదోని సెంట్రల్: నేడు జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, ఇతర సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఎన్నికల సిబ్బంది తీసుకుని ఆయా కేంద్రాలకు తరలివెళ్లారు. సామగ్రి భద్రపరిచిన ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్ట్రాంగ్ రూంలను ఆర్ఓ శివనారాయణ శర్మ ఆయా పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఓపెన్ చేశారు. పోలింగ్ సామగ్రి పంపిణీని ఎన్నికల అబ్జర్వర్ మీర్ తారిఖ్ అలీ పరిశీలించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్నికల సిబ్బంది సెక్టోరియల్, సీరియల్ నంబర్ల ఆధారంగా పీఓ, ఏపీఓలకు ఈవీఎంలు, వీవీప్యాట్‌లను అందించారు. ఆదోని నియోజకవర్గంలోని 256 కేంద్రాల్లో పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు 1800 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 256 మంది వీఎల్ఓలు, 28 మంది సెక్టార్ ఆఫీసర్లు, 35 మంది వీడియోగ్రాఫర్లు, బీఈఎల్ ఇంజినీర్లు, సమస్యాత్మక ప్రాంతంలో 49 మంది మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 250 మంది మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. ఎన్నికల సామగ్రిని అందుకున్న సిబ్బంది వాటిని సరిచూసుకుని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.


పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది


ఎన్నికల విధులకు సన్నద్ధమైన పోలీసులు

పటిష్ట బందోబస్తు

ఎన్నికల నిర్వహణలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇద్దరు డీఎస్పీలతో పాటు ఆరుగురు సీఐలు, 8 మంది ఎస్ఐలు 147 మంది పోలీసులను నియమించారు. వీరితో పాటు 80 మంది ఏఆర్ కానిస్టేబుల్స్, 48 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు, 96 మంది హోంగార్డులు, 38 మంది ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సేవా వలంటీర్లను నియమించారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఉరుకుంద గ్రామ కార్యకర్తలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామం ఎస్సీ కాలనీలో టీడీపీకి చెందిన 15 కుటుంబాల వారు ఆదివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. అలాగే కౌతాళంలో బీజేపీకి చెందిన ఐదు కుటుంబాలు వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి కండువాలు కప్పి ఆహ్వానించారు.